ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




కరీంనగర్

జిల్లా వార్తలు

3

శనివారం 8 మార్చి 2025



- సవరించిన వేతనాలతో విధుల్లోకి చేర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం
- ఆందోళన చెందుతున్న ఉద్యోగులు



ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాల్లో కోత

కరీంనగర్ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలకు రాష్ట్ర ప్రభు త్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025తో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కాలపరిమితి ముగిసింది. దీంతో కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి జీవో ఆర్‌టి 69, తేదీ 1.2.205 రోజున 30,955 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కొనసాగింపునకు పరి పాలన మంజూరు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా మరో ఏడాది పాటు ఉద్యోగంలో కొనసాగవచ్చని సంతోషించారు. నాలు గేళ్లుగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలను ప్రభుత్వం పెంచలేదు. ఈ సంవత్సరం అయినా పెరుగుతున్న ధర లకు అనుగుణంగా వేతనాలను పెంచాలని ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వేతనాలను పెంచాల్సిన ప్రభుత్వం పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రీషియన్లు, సబార్డినేట్ ఉద్యోగుల వేతనాలను సవరించింది. ఈ క్రమంలో ప్రస్తుతం తీసుకున్న వేతనాల కంటే దాదాపు 25 శాతం తగ్గిస్తూ ప్రజారోగ్య కార్మికులు కాని వారికి 15,600, పీహెచ్‌వర్కర్లు, డ్రైవర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ల వేతనాలను ఒకే కేటగిరిలో 16,600 రూపా యలుగా నిర్ణయించింది. ఈ వేతనాలతో ఉద్యోగులను తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం వారు 19,600, 20,950, 21,950 వేతనాలతో పనిచేస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ జీవోతో తమ వేతనాలతో 25 శాతం కోత పడిందంటూ ఆందోళన చెందుతున్నారు.

● అసలే అరకొర వేతనం.. అందులో కోతలు

కరీంనగర్ నగరపాలక సంస్థలో 1,118 మంది పీహెచ్ వర్కర్లు పనిచేస్తున్నారు. 105 మంది డ్రైవర్లు, 26 మంది వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, 50 మంది నాన్ పీహెచ్ వర్కర్లకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రజలతో మమేకమై, ఆరోగ్యాలను ఫణంగా పెట్టి దుమ్మూ ధూళి, చెత్తాచెదారంలో పనిచేస్తున్న తమ వేతనాల్లో కోత విధించడం అన్యాయమని అంటున్నారు. ప్రతి సంవత్సరం రెగ్యులర్ ఉద్యోగులకు జీతభత్యాలను పెంచుతున్న ప్రభుత్వం తమపై ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఇంటి అద్దెలు, నిత్యావసర వస్తువుల ధరలు, స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చులను భరించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. ఎప్పటికైనా తమకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశతో ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో పనిచేస్తున్నామని, తమ వేతనాలను పెంచాలే తప్పా సవరించడం సరికాదని వారంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ పట్ల సానుకూలధోరణితో ఆలోచించి తగ్గించిన వేతనాలను సవరించడంతోపాటు ప్రస్తుతం ఉన్న వేతనాలను 25 శాతం పెంచాలని కోరుతున్నారు.

వేతనాలను తగ్గించడం మతిలేని చర్య

- కేంద్రహోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్

మున్సిపాలిటీల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న డ్రైవర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్ల వేతనాలను పెంచాల్సిన ప్రభుత్వం 25 శాతం తగ్గించడం మతిలేని చర్య. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ శానిటేషన్ ఉద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గం. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా వేతనాలను పెంచకుండా భారీగా కోత విధించడం ఎంతవరకు సమంజసమో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వాటిని చెల్లించడం లేదు. జీపీఎఫ్‌లో దాచుకున్న సొమ్మును డ్రా చేసుకోకుండా ఇబ్బంది పెడుతోంది. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే ఈ పొరపాటును సరిదిద్దుకొని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి.

వేతనాలు తగ్గించడం దుర్మార్గం

- మాజీ మేయర్, బీజేపీ నేత యాదగిరి సునీల్‌రావు

మున్సిపాలిటీల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వారి ప్రాణాలను ఫణంగా పెట్టి చెత్తలో పనిచేస్తున్న కార్మికులకు ఏ ప్రభుత్వం అయినా వేతనాలు పెంచి వారి క్షేమం కోరుతుంది.. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల వేతనాలను తగ్గించి ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గం. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల వేతనాలు పెంచాలి.

ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రిబేటును సద్వినియోగం చేసుకోండి

- జిల్లాలో 44,437 దరఖాస్తులకు ఫీజు నిర్ణయించాం
- ఈ నెల 31 వరకు గడువు
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఈ నెల 31 లోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించినట్లయితే 25 శాతం రిబేటు లభిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సుడా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తుదా రులు ఎల్ఆర్ఎస్ 2020 వెబ్‌సైట్‌లోకి వెళ్లి వివరాలు ఎంటర చేస్తే వారి దరఖాస్తుకు సంబంధించి ఫీజు వివరాలు తెలుస్తాయన్నారు. జిల్లాలోని కార్పోరేషన్, సుడా, మున్సిపాలిటీలు అన్నీ కలిపి 44,437 దరఖా స్తులకు ఫీజు నిర్ణయించామని తెలిపారు. ఫీజు నిర్ణయించని 1,435 దరఖాస్తులు ప్రోహిబి టెడ్‌లో లేకపోతే మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామన్నారు. పదిశాతం ప్లాట్లు అమ్మిన వెంచ ర్స్‌కు కూడా మిగితా ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ కట్టుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలి పారు. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులందరూ సద్విని యోగం చేసుకోవాలని ఎల్ఆర్ఎస్ లేని ప్లాట్ల కు భవి ష్యత్తులో ఎలాంటి అనుమతులు ఇవ్వరని, రిజిస్ట్రేష న్‌లు కావని చెప్పారు. దరఖాస్తు దారులకు ఏవైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి టోల్ ఫ్రీ నంబర్లు 9652404978, 7093750333కు ఫోన్ చేయవచ్చని వివరించారు. సమావేశంలో అద నపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సీపీవో ఆంజనేయులు, ఫీల్డ్‌ఆఫీసర్లు అజయ్‌రెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు రూ. ఐదు కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు 4

ఆకాశంలో సగం..
● నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం 5

'ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయాలి'

కరీంనగర్ టౌన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను వంద వసూలు చేయాలని వార్డు ఆఫీసర్లను నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వాహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు ఆఫీసర్లు ప్రతి రోజు ఉదయమే తమకు కేటాయించిన డివిజన్లలోకి వెళ్లి ప్రతి ఇంటి నుంచి పన్నులు వసూలు చేయాలన్నారు. ప్రభుత్వ భవనాలు, కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లు, హోటళ్ల, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాళ్ల, ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టిపెట్టి బకాయిలను వసూలు చేయాలన్నారు. పన్నులు చెల్లించని వారికి రెవెన్యూ రికవరీ యాక్టు కింద నోటీసులు జారీ చేయాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఆర్వోను ఆదేశించారు. నగరవాసులు సకాలంలో పన్నులు చెల్లించి నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

● సెలవులో నగరపాలక సంస్థ కమిషనర్

నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సెలవులో వెళ్లారు. శుక్రవారం ఆమె కార్యాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించిన అనంతరం మున్సిపల్ ప్రత్యేకాధికారి, కలెక్టర్ పమేలా సత్పతి కలిసి ఈనెల 15వ తేదీ వరకు సెలవు పెడుతున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బాధ్యతలను కలెక్టర్ అప్పగించారు.

పోలీస్ కమిషనర్‌గా గౌస్ ఆలం

● ప్రస్తుత సీపీ అభిషేక్ మొహంతిని రిలీవ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా గౌస్ ఆలం నియామకం అయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ సీపీగా పనిచేసిన అభిషేక్ మొహంతి బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు పోలీస్‌కమిషనర్లు, ఎస్పీలు, డీసీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్ర వారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆదిలాబాద్ ఎస్పీగా పని చేస్తున్న గౌస్ ఆలంను కరీంనగర్ సీపీగా బదిలీ చేశారు. సీపీ అభిషేక్ మొహంతితోపాటు మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులను వెంటనే రిలీవ్ చేయాలని కేంద్ర హోంశాఖ ఫిబ్రవరి 21న ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మిగతా వారిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రిలీవ్ చేయగా కరీంనగర్ పట్ట భద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున అభిషేక్ మొహంతిని మాత్రం బదిలీ చేయకుండా ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసింది. ఎన్నికల కోడ్ ఉన్నందున సీపీ అభిషేక్ మొహంతి ఇప్పటి వరకు కొనసాగారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సీపీ అభి షేక్ మొహంతితోపాటు చాలా మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

● సీపీ గౌస్ ఆలం బయోడెటా

కరీంనగర్ పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం బీహార్‌లోని గయాలో జన్మిం చారు. ఆయన ముంబై ఐఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గౌస్ ఆలం శిక్షణలో పరేడ్ కమాండర్‌గా వ్యవహరించి బెస్ట్ ఆల్‌రౌండర్ అవార్డు సాధించారు. ఐపీఎస్ శిక్షణ అనంతరం ఏటూరు నాగారం ఏఎస్పీగా విధులు నిర్వ హించారు. అనంతరం ఖమ్మం ఓ ఎస్డీగా పనిచేశారు. 2022లో ము లుగు ఎస్పీగా పనిచేశారు. 2024 జన వరిలో ఆదిలాబాద్ ఎస్పీగా నియమి తులయ్యారు. శుక్రవారం కరీంనగర్ పోలీస్‌కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

● 16 నెలల కాలంలో తనదైన ముద్ర వేసిన అభిషేక్ మొహంతి

కరీంనగర్ పోలీస్‌కమిషనర్‌గా 16 నెలలకాలం అభిషేక్ మొహంతి పని చేశారు. ఆయన ముక్కుసూటిగా వ్యవహరించారు. డీజీ పదోన్నతి తోనే బదిలీపై వెళతారని అను కున్నప్పటికీ అనూహ్యంగా కేంద్ర హోంశాఖ ఆదేశాలతో ఆయన బదిలీ అయ్యారు. జిల్లాలో ల్యాండ్ మా ఫియా, చిట్‌ఫండ్స్‌పై బాధితులు వందల సంఖ్యలో సీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఈ దందాలపై ఉక్కు పాదం మోపేందుకు సీపీ అభిషేక్ మొహంతి ప్రత్యేకంగా డీజీపీ నుంచి అనుమతి తీసుకుని ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యు)ను ఏర్పాటు చేశారు. ప్రతి ఫిర్యాదును తనే స్వయంగా పరిశీలించి, విచారణ జరిపి నింది తులను గుర్తించి కటకటాల వెనక్కి పంపించారు. నిందితుల్లో అప్పటి అధికారపార్టీ నాయకులు, ప్రము ఖులు, ప్రభుత్వ అధికారులుం డ డంతో ఒక్కసారిగా అక్రమార్కుల్లో అలజడి రేగింది. దీంతో 90 శాతం ఫిర్యాదులపై రాజీ కుదుర్చు కున్న అక్రమార్కులు కేసులు, అరెస్టుల నుంచి బయట పడగా బాధితులకు ఎలాంటి కేసులు లేకుండానే న్యా యం జరిగింది. దీంతో అక్రమ దం దాలు, అక్రమార్కులపై పోలీస్ కమి షనర్ వ్యవహరించిన తీరుపై సామా న్యులు మొదలుకొని అందరు ప్రజల నుంచి ప్రశంసలు అందు కున్నారు.

● కరీంనగర్ పోలీస్‌కమిషనర్‌గా అభిషేక్ మొహంతి 2023 అక్టోబరు 31న బాధ్యతలు చేపట్టి 16 నెలల కాలం పూర్తి అయింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాజకీ యపార్టీలను సమానంగా చూస్తూ తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకుని ఎమ్మెల్యేలపై కూడా ఎన్నికల కేసులు నమోదు చేశారు. ఎన్నికల సమ యంలో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించారు.

సెల్‌ఫోన్ దొంగల పట్టివేత



దొంగలను తాళ్లతో కట్టేసిన స్థానికులు

పెద్దపల్లిటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలను స్థానికులు పట్టుకున్నారు. ఈసాలతక్కళ్ళపల్లికి చెందిన ఓవ్యక్తి హైదరాబాద్ వెళ్కేందుకు గురువారం పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ట్రెయిన్ ఆలస్యంగా ఉండడంతో అక్కడే ఒకచోట కూర్చోగా ఇద్దరు వ్యక్తులు అనుమానంగా తిరుగుతూ కనిపించారు. కొంతసేపటి తరువాత సెల్‌ఫోన్ కనబడలేదు. దీంతో గురువారం రాత్రంతా వెతుకగా తెల్లవారు స్థానికుల సహాయంతో ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. రెండు సెల్‌ఫోన్లలో ఒకటి తిరిగి ఇచ్చారు. ఇద్దరి చేతులను తాళ్ళతో కట్టి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామని చెప్పారు. కాగా, పోలీస్‌స్టేషన్లో ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. చోరీకి పాల్పడిన నిందితులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సతీష్, రాములుగా తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన జీవన్

తంగళ్లపల్లి (సిరిసిల్లరూరల్), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దెనపల్లి గ్రామంలో ఇంటి ముందు ఆడుకుంటున్న జీవన్ అనే బాలుడిపై శుక్రవారం సాయంత్రం వీధికుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పర్వతాల మహేష్, సరిత దంపతుల కుమారుడైన జీవన్ సాయంత్రం స్కూల్ నుంచి వచ్చి ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కల గుంపు వచ్చి దాడి చేసి తలతో పాటుచెవులు, శరీరంపై పలుచోట్ల కరిచాయి. దీంతో బాలుడి అరుపులు విన్న గ్రామస్థులు కుక్కల గుంపును తరిమివేసి చికిత్స కోసం సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఆర్‌ఎంపీ వైద్యుడిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడిపై శుక్రవారం పిచ్చికుక్క దాడి చేసింది. గ్రామానికి చెందిన రాజలింగం అనే ఆర్‌ఎంపీ వైద్యుడు తన ఇంటి ముందు నిలబడి ఉండగా అటువైపు వచ్చిన ఓ పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. చికిత్స నిమిత్తం చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మండల కేంద్రంలో వారంపది రోజుల నుంచి పదిమందికి పైగా దాడిచేసినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది పిచ్చికుక్కల రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గేదెపై చిరుత దాడి..

● ఆందోళనలో అన్నదాతలు..

వేములవాడ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ శివారులో రైతుకు చెందిన గేదెపై చిరుతపులి దాడి చేయడంతో గేదె అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పరి నారాయణ రోజులాగే తన పొలం వద్ద ఉన్న షెడ్డులో గేదెను కట్టివేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం వెళ్లి చూడగా గేదెపై దాడి చేసి ఉండడం, వెనుక భాగం పూర్తిగా తిని ఉండటం చూసి గ్రామస్థులకు సమాచారం అందించారు. వెంటనే స్థానికులు అక్కడికి వెళ్లి చూడగా గేదెపై పులి దాడి చేసినట్లు ఉంది. ఫారెస్ట్అధికారి ఖలీల్ ఉద్దీన్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇంకా పులి అనే విషయాన్ని ఆయన నిర్ధారణ చేయలేదని, గేదెను చంపిన అనంతరం పులి అటవీప్రాంతానికి వెళ్లినట్లు అక్కడ ఉన్న మహిళలు భయపడుతున్నారు. పులి పాదాలకు సంబంధించిన ఆనవాళ్ల కనబడడంతో సమీప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హైనా దాడిలో లేగదూడ మృతి

చిగురుమామిడి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరికి చెందిన జీల మల్లేశ్‌యాదవ్ అనే రైతుకు చెందిన లేగ దూడ శుక్రవారం హైనాదాడిలో మృతి చెందింది. వ్యవసాయ బావివద్ద రోజువారిగానే పశువులను కట్టేసి వచ్చిన మల్లేశ్ శుక్రవారం ఉదయం బావి వద్దకు వెళ్లేసరికి లేగదూడమృతి చెందిఉంది. ఈవిషయం ఫారెస్టు, రెవెన్యూఅధికారుకు తెలియజేసి నట్లు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాముడిపెంట ప్రాంతంలోని తాళంవేసి ఉన్నఇంట్లో చోరీ జరిగినట్టు ఎస్‌ఐ రామచంద్రుడు శుక్రవారం తెలిపారు. పోలీసులు, బాధితుడు మైలారం అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య తన కుటుంబసభ్యులతో వారం రోజుల క్రితం హైదరాబాదులోని కుమారుడి వద్దకు వెళ్లారు. గురువారం రాత్రి సమయంలో ఇంటికి తిరిగి రాగా తలుపులకు వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉండగా, ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడి ఉంది. దీంతో అంజయ్య పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రామచంద్రుడు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించాడు. బీరువాలో ఉన్న మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, 50వేల రూపాయల నగదు అపహరణకు గురియినట్లు అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామచంద్రుడు తెలిపాడు.

వేములవాడలో..

వేములవాడ టౌన్: పట్టణంలోని మున్నూరుకాపుసత్రం సమీపంలో తాళంవేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కుమార్ అనే ఇంటి యజమాని వేడుక నిమిత్తం గురువారం ఇంటికి తాళంవేసి ఊరికి వెళ్లారు. కార్యక్రమం ముగించుకొని శుక్రవారం ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండగా గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లోని దాదాపు తులం బంగారు ఆభరణాలతో పాటు 30 తులాల వెండి ఆభరణాలు చోరీఅయ్యాయని వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హుజూరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లోని కాకతీయ పాఠశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేగంగా, అజాగ్రత్తగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ రోడ్డు పక్కన ఆగిఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్నఇద్దరిలో యాకూబ్‌కు తీవ్రగాయాలు కాగా, ముజాహిద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనేవారిని108లో జమ్మికుంటలోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ బస్‌లో వ్యక్తి మృతి

వీణవంక, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఒడ్డెపల్లి ఓదెలు(58) ఆర్టీసీ బస్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఓదెలు కరీంనగర్‌లో ఓ ప్రైవేటు బ్యాంక్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజువారిగా శుక్రవారం సాయంత్రం ఆర్టీసీబస్‌లో రెడ్డిపల్లి నుంచి కరీంనగర్ వెళ్లాడు. బస్సు అల్గునూరు వద్దకు వెళ్లగానే పక్కకు పడిపోవడంతో గమనించిన తోటి ప్రయాణికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందిచడంతో అసుపత్రికి వెళ్లినట్టు తెలిపారు.

మహాలక్ష్మి ఇబ్బందులు తొలగేనా?

● ఆర్టీసీలో పెరగని బస్సులు ● పెరిగిన మహిళల రద్దీ



కరీంనగర్ బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న మహిళలు

భగత్‌నగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరంగా మారినా, అందుకనుగుణంగా తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల సంఖ్య పెంచక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత వచ్చే రెండవ మహిళా దినోత్సవం నుంచైనా మహిళల కోసం అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను పెంచి ఇబ్బందులు తొలగించాలని మహిళలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం (మహాలక్ష్మి) పథకాన్ని అమలు చేసినా దానికనుగుణంగా బస్సు సర్వీసులు లేక మహిళామణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోలు ఉండగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నది. కరీంనగర్ రీజియన్ పరిధిలోని కరీంనగర్-1, కరీంనగర్-2, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ, హుస్నాబాద్, హుజూరాబాద్, గోదావరిఖని, మంథని డిపోలు ఉన్నాయి. రీజియన్ వ్యాప్తంగా తొమ్మిది వందలపై చిలుకు బస్సులు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రూట్లలో బస్సులు నడిపిస్తున్నా పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచక పోవడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త బస్సులను ప్రవేశపెడతామని చెప్పిన ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను మాత్రం తీసుకు వచ్చింది. ఎలక్ట్రిక్ బస్సులు పట్టణాలకే పరిమితమవడంతో గ్రామీణ ప్రాంతాలకు బస్సుల కొరత ఉంది. కరీంనగర్ నుంచి రాయపట్నం, గోదావరిఖని, జగిత్యాల, హుజూరా బాద్ రూట్లలో మహిళల రద్దీ తీవ్రంగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్- రాయ పట్నం రూట్‌లో మహాలక్ష్మి పథకానికంటే ముందే రద్దీ తీవ్రత ఎక్కువగా ఉండేది, మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత మహిళల రద్దీ పెరగడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

మహిళలు ఉన్న చోట్ల ఆగని బస్సులు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో బస్టాండ్లలోనే బస్సులు నిండిపోతున్నాయి. ప్లాట్ ఫాంలపైకి రాక ముందే బస్సుల్లోకి ఎక్కేందుకు ప్రయాణికులు హైరానా పడుతున్నారు. ఉన్న కొద్ది పాటి బస్సులతోనే అన్ని రూట్లలో బస్సులు నడిపిస్తున్నా రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ దాటినతర్వాత బస్సులు ఎక్కాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. నగరంలోని వివిధ బస్టాప్‌లలో మహిళలు ఎక్కువగా ఉంటే డ్రైవర్లు బస్సులు ఆపడం లేదని అంటున్నారు. మహిలలను డ్రైవర్లు, కండక్టర్లు చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకునైనా అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను పెంచే ప్రకటన చేయాలని మహిళలు కోరుతున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలు వినియోగించుకునేలా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కృషి చేయాలని మహిళలు కోరుతున్నారు.

బస్సులు ఆపడం లేదు: సాహితి, విద్యార్థిని



మహిళలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో బస్సులు ఆపడం లేదు. విద్యార్థులు దూరప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. మహాలక్ష్మి పథకం మహిళలు వినియోగించుకునే విధంగా బస్సులు ఆపాలి. బస్సుల సంఖ్యను పెంచాలి.

బస్సుల సంఖ్యను పెంచాలి: కీర్తన, గృహిణి



పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ఎక్కువగా బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. మహిళల కోసం ప్రత్యేక బస్సులు ఆర్టీసీ నడిపించాలి.



బస్సును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్న లారీ



డివైడర్‌ను ఢీకొట్టి నిలిచిపోయిన లారీ

కోరుట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెనుప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్సును తప్పించబోయి భారీలోడుతో వస్తున్న లారీ డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో బస్సులోఉన్న ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం ఉదయం జగిత్యాల నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీబస్సు డ్రైవర్ గమనించకుండా ఇన్‌గేట్ నుంచి బస్టాండ్‌లోకి బస్సును తీసుకుపోతున్నాడు. ఇదే సమయంలో మెట్‌పల్లి నుంచి జగిత్యాలవైపు వెళ్తున్న లారీడ్రైవర్ బస్సును తప్పించబోయాడు. దీంతో పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. సంఘ టనలో ఎలాంటి ప్రాణనష్టం చోటు చేసుకోలేదు. ఈ సంఘటనతో బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

దేవాలయాల్లో చోరీ

శంకరపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రేణుకఎల్లమ్మ, పోచమ్మదేవాలయాల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన ఘటన మొలంగూర్ గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలప్రకారం.. శంకరపట్నం మండలం మొలంగూర్‌గ్రామంలోని రేణుక ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయాల్లో గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలకొట్టి ప్రవేశించారు. ఆలయంలోని హుండీల తాళాలను ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరగడం ఇది మూడోసారి అని గౌడసంఘం నాయకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం రగుడు చౌరస్తాలోని మహాశివరాత్రి సందర్భంగా కట్టెలతో ఏర్పాటుచేసిన కమాన్‌లో శుక్రవారం రాత్రి బైక్ ఇరుక్కొని ముస్తాబాద్ మండలం తుర్కపల్లికి చెందిన ప్రశాంత్(32)కు తీవ్రగాయాలయ్యాయి. వేములవాడ నుంచి సిరిసిల్ల వైపు ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదం సంభవించింది. తీవ్రగాయాలతో కమాన్‌లో ఇరుకున్న యువకుడిని స్థానికులు బయటకు తీసి చికిత్స కోసం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

వేములవాడ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణం తిప్పాపూర్ శివారులోరోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఆగిఉన్న లారీని కారు ఢీకొట్టింది. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్సై సముద్రాల రాజు ఘటన స్థలానికిచేరుకొని ప్రమాదానికిగల కారణాలను పరిశీలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎమ్మెల్యేలకు రూ. ఐదు కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు

● నిధుల ఖర్చులో వేసవిలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి ● మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు... సంస్థాగతంగా బలోపేతం కావాలి ● ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ● హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో సమీక్షా సమావేశం



సమావేశంలో చర్చిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

కరీంనగర్ అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి నియోజకవర్గానికి స్పెషల్‌డెవలప్‌మెంట్‌ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద 5కోట్ల రూపాయలు ఇస్తున్నామని, గతంలో ఇచ్చిన 10కోట్లకు ఇవి అదనమని ఉమ్మడిజిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సంబంధించి పెండింగ్ అంశాలు, అభివృద్ధి పనులపై హైదరాబాద్‌లోని జలసౌధలో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గతంలో ఎస్‌డీఎఫ్ 10 కోట్ల నిధుల్లో ఎంత వరకు పనులు జరిగాయని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మంజూరు చేస్తున్న ఐదు కోట్ల నిధులను తాగునీటి సంబంధ అవసరాలకు మొదటి ప్రాధాన్యంతో ఖర్చుచేయాలని మంత్రులు సూచించారు. అనంతరం ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపై చర్చించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, మరో మూడు నెలల్లో స్థానికసంస్థల ఎన్నికలు ఉంటాయని మంత్రి తెలిపారు. ఈలోగా నియోజకవర్గాల్లో నీటి పారుదలకు సంబంధించిన పెండింగ్ పనులుంటే త్వరగా పూర్తి చేసేలాచర్యలు తీసుకోవాలని సూచించారు. శాసనసభ్యులు కలిసి కట్టుగా జిల్లా అభివృద్ధిపై దృష్టిని సారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, సంజయ్‌కుమార్, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పురుమల్ల శ్రీనివాస్, జువ్వాడి నర్సింగరావు, ప్రణవ్‌బాబు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న కేంద్ర సమాచార, ప్రసారభారతి అధికారులు

వేములవాడ కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీపార్వతి రాజరాజేశ్వరస్వామి వారిని శుక్రవారం కేంద్ర సమాచార శాఖ ప్రసారభారతి అధికారులు దర్శించుకున్నారు. ప్రసారభారతి తెలంగాణ క్లస్టర్ హెడ్ హరిసింగ్, దక్షిణాది రాష్ట్రాల జోనల్ హెడ్ గీతారాణిలు దర్శించుకునిప్రత్యేకపూజలు నిర్వహించారు. ముందుగా కోడెమొక్కు చెల్లించుకున్నారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ శ్రీనివాస్, టిసి లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది ఉన్నారు.



ఆశీర్వదిస్తున్న అర్చకులు

కొడుకును ఉద్యోగంలో పెట్టించేందుకు నకిలీ ధ్రువపత్రాల సృష్టి

● తండ్రితో పాటు సహకరించిన ముగ్గురి రిమాండ్ ● నిందితుల్లో విశ్రాంత తహసీల్దార్, డీఎంహెచ్‌వో ఉద్యోగి



నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కొడుకును ఉద్యోగంలో పెట్టించేందుకు నకిలీ ధ్రువీకరణ పత్రాలను సృష్టించిన తండ్రితోపాటు ఆయనకు సహకరించిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. నిందితుల్లో కరీంనగర్ పట్టణానికి చెందిన విశ్రాంత తహసీల్దార్ చిమ్మల బీరయ్య, డీఎంహెచ్‌వోలో విధులు నిర్వహిస్తున్న మహ్మద్ బాసిద్ హుస్సేన్‌లు ఉన్నారని చెప్పారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వివరాలను ఆయన వెల్లడించారు. మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక పశు వైద్యశాలలో లైవ్‌స్టాక్ అధికారిగా పని చేస్తున్న కరీంనగర్ పట్టణానికి చెందిన జడ కొమురయ్య కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నానని, అనారోగ్య కారణంగా ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ పొందేందుకు రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆయన దరఖాస్తును పరిశీలించారు. దాంతో కొమురయ్య నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించారని ఎల్లారెడ్డిపేట పశు వైద్యాధికారి ఈ నెల 1న స్థానిక పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రమాకాంత్ కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో దర్యాప్తును చేపట్టారు. జడ కొమురయ్య తాను అనారోగ్య కారణంగా ఉద్యోగవిరమణ పొంది కొడుకును తనస్థానంలో ఉద్యోగంలో పెట్టించాలని కరీంనగర్‌కు చెందిన విశ్రాంత తహసీల్దార్ చిమ్మల బీరయ్యను సంప్రదించారు. అందుకు రూ.3లక్షలు ఇవ్వాలని బీరయ్య చెప్పడంతో కొమురయ్య అప్పగించారు. విశ్రాంత తహసీల్దార్ బీరయ్యకు డీఎంహెచ్‌వోలో విధులు నిర్వహిస్తున్న మహ్మద్ బాసిద్ హుస్సేన్‌ను పరిచయం చేసి వివరాలు తెలిపారు. ఆయనకు తెలిసిన కరీంనగర్‌లోని ల్యాబ్ టెక్నీషియన్ కొత్తపల్లి రాజేశంను కలవాలని సూచించారు. రాజేశం వద్ద కరీంనగర్‌లోని సన్‌షైన్ ఆసుపత్రికి సంబంధించిన నకిలీపత్రాలు, స్టాంపులు, అందుబాటులోని లేని వైద్యుల సంతకాలు ఫోర్జరీ చేసి ధ్రువీకరణ పత్రాలను సృష్టించామని విచారణలో అంగీకరించారు. వారి వద్ద నుంచి ఆసుపత్రికి సంబంధించిన నకిలీపత్రాలు, 18 నకిలీ స్టాంపులు, కంప్యూటర్, మానిటర్, సీపీయూ, పవర్ కేబుల్, సిస్టం లింక్ కేబుల్‌ను స్వాధీనపర్చుకున్నామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు. ఆయన వెంట ఎస్‌ఐ రమాకాంత్ ఉన్నారు.

పెళ్లి ఊరేగింపులో కారు ఢీకొని మహిళ మృతి



ఉమ (ఫైల్)

శంకరపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పెళ్లి ఊరేగింపులో కారు ఢీకొని మహిళమృతిచెందిన సంఘటన మండలంలోని మెట్‌పల్లిగ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. ఈనెల6 గురువారం రోజున మెట్‌పల్లిలో బకారపు ప్రభాకర్ కుమార్తె నవ్య వివాహం మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన జినుక అశోక్‌తో జరిగింది. సాయంత్రం అప్పగింతలు అయిన తర్వాత కారు డ్రైవర్ కురుమ శ్రావణ్ ప్రభాకర్ ఇంటినుంచి నూతన వధూ వరులను, బంధువులను కారులో తీసుకొని ఊరేగింపు కార్యక్రమానికి బయలు దేరారు. ఊరేగింపులో భాగంగా నృత్యాలు చేస్తుండగా డ్రైవర్ శ్రావణ్‌కు ఫోన్ రావడంతో కారు దిగి పక్కకెళ్లి మట్లాడుతున్నాడు. ఈక్రమంలో పెళ్లి కుమారుడు అశోక్ కారును హఠాత్తుగా ముందుకు పోనిచ్చాడు. దీంతో కారు అక్కడ నృత్యాలు చేస్తున్న బకారపు ఉమ(35), కూతురు బకారపు నిఖితతోపాటు పలువురు పైకి దూసుకెళ్లింది. వెంటనే ఉమను భర్త పర్శరాములు హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం వరంగల్ ఎంజీఎంకు, అక్కడినుంచి హైదరాబాద్ తీసుకెళ్తుండగా శుక్రవారం తెల్లవారుజామున మార్గమధ్యలో మృతిచెందింది. ఉమ కూతురు నిఖితకు కుడి భుజం, కాలు విరిగింది. మృతురాలి భర్త బకారపు పర్శరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

న్యాయం చేయాలంటూ ఆందోళన..

హుజూరాబాద్: హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి ఎదుట శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలోని పెళ్లి ఊరేగింపులో గాయపడి మృతిచెందిన బకారపు ఉమ, గాయపడిన వారికి నష్టపరిహారం అందించి న్యాయంచేయాలని శుక్రవారం బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఎండుతున్న పంటలు.. రోడ్డెక్కిన రైతులు..

● సిద్దిపేట-కామారెడ్డి రహదారిపై బైఠాయింపు



గంభీరావుపేట పెద్ద కాలువ వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు

గంభీరావుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట పెద్ద కాలువ ఆయకట్టు రైతులు రోడెక్కారు. పంటలు ఎండుతుండటంతో సిద్దిపేట- కామారెడ్డి రోడ్డుపై బైఠాయించి, సాగునీరు ఇవ్వాలనిడిమాండ్ చేశారు. ఎగువమానేరు నీటిని నమ్ముకుని పెద్ద కాలువ కింద 2000ఎకరాలకు పైగా పంటలు వేశామని, ఇప్పుడు పెద్ద కాలువలో చుక్కనీరు లేదని వాపోయారు. ఎగువ మానేరు నీటిని పెద్ద కాలువలోకి విడుదల చేస్తేనే పంటలు దక్కే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రత్యేక తూం ఏర్పాటు చేస్తేనే పెద్ద కాలువ ఆయకట్టు రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రోడ్డుపై ఆందోళన చేయడంతో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. రైతుల ఆందోళనకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. పరిస్థితి తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీస్‌లు అక్కడికి చేరుకుని వారిని శాంతింపచేసే ప్రయత్నం చేశారు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా ఆందోళన విరమించాలని పోలీసుల సూచనల మేరకు రైతులు శాంతించారు. ఈ ఆందోళనలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు ప్రసాద్‌రెడ్డి, స్వామి, రాజు, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.





హక్కుల కోసం పోరాడాలి..

డాక్టర్ కె శ్రీవాణి, అర్థశాస్త్రం విభాగం అధిపతి, శాతవాహన విశ్వవిద్యాలయం

మహిళా హక్కుల కోసం పోరాడిన సావిత్రిబాయి పూలే, దుర్గాబాయి దేశ్‌ముఖ్ వంటి మహిళామణుల స్ఫూర్తిని స్మరించుకుంటు ముందుకు సాగాలి. మహిళా సాధికారత అనేది ఒక్క రోజులో సాధించలేము. ప్రతిరోజు మనం ఒక ముందడుగు వేస్తే కచ్చితంగా లక్ష్యాన్ని చేరుకోగలం. మహిళా దినోత్సవం మహిళల హక్కుల కోసం పోరాడేందుకు, లింగ సమానత్వం సాధించేందుకు ఒక గొప్ప అవకాశం.



మహిళా సాధికారతను ప్రోత్సహించాలి..

మెట్టు విజయలక్ష్మి, అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ

ప్రజాసామ్యంలో మహిళలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ప్రజాసామ్య వ్యవస్థ సమాన హక్కులు, అవకాశాలను అందించే సిద్ధాంతంపై ఆధారపడి ఉంటుంది. మహిళల హక్కులు, స్వేచ్ఛ, రాజకీయ, సామాజిక, ఆర్థిక సమానత్వంలాంటి వాటిని ప్రోత్సహించాలి. పురుషులతో సమాన హక్కులను మహిళలకు కల్పించడంతో పాటు మహిళా సాధికారతను ప్రోత్సహించాలి. మహిళల రాజకీయ ప్రాతినిధ్యం ప్రజాస్వామ్య వ్యవస్థలో కల్పించాలి. మహిళలపై వివక్ష, లింగ అసమానతలు, హింస వంటి సమస్యలను ఎదుర్కోవడానికి చట్టాలు, విధానాలను రూపొందించాలి.



అసమానతలు తొలగాలి..

డాక్టర్ స్రవంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్

ఇప్పటికీ మహిళలపై అణచివేత కొనసాగుతూనే ఉంది. మహిళలు అన్ని రంగాల్లోకి ముందుకు రావాలంటే విద్య ఉద్యోగం వ్యాపారం రాజకీయాల్లో సరైన భాగస్వామ్యం అనేది తప్పనిసరి. అసమానతలు తొలగినప్పుడే ఇది సాధ్యమవుతుంది. సమాజంలో ఒక మహిళను బలపరిస్తే ఆమె ఒక కుటుంబాన్ని బలపరుస్తుంది. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి.

అన్ని రంగాల్లో ప్రాధాన్యమివ్వాలి..

మిట్టగడుపల సౌజన్య, జిల్లా మత్స్యశాఖ అధికారి, సిరిసిల్ల



మహిళలు చేయలేని పనులు లేవు. అన్ని పనులను ఎలాంటి కష్టం లేకుండానే చేసుకుంటూ పోతుంటారు. మహిళలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పడమే తప్ప ఎక్కడా అమలు చేయడంలేదు. కనీసం గుర్తించడం కూడా లేదు. నిరంతరం ఎలాంటి అలసట లేకుండా కష్టపడుతున్న మహిళలకు సమాజంలోని అన్నిరంగాల్లో ప్రాధాన్యమివ్వాలి. ఆదరించి గుర్తింపునివ్వాలి.

సమాన హక్కులు కల్పించాలి..

ఎంఏ భారతి, జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ, సిరిసిల్ల



సమాజంలో మహిళలకు పురుషులతో సమాన హక్కులను కల్పించడంతో పాటు స్వేచ్ఛను ఇవ్వాలి. కుటుంబాల్లో మహిళలను పురుషులతో సమానంగా చూడాలి. చదువు నేర్పించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల విషయంలోనే కాకుండా ప్రతి విషయంలో కూడా ఆడ,మగ సమానం అనే ఆలోచన విధానంతో ప్రతి ఒక్కరూ ఉండాలి. మహిళలు అన్నిరంగాల్లో ధైర్యంగా ముందుకెళ్లాలి. ఎలాంటి ఒత్తిళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి.

ఆకాశంలో సగం



కరీంనగర్ సమీపంలోని ఎల్‌ఎండీలో తెప్ప నడుపుతున్న యువతి

ప్రపంచానికి మార్గదర్శకంగా మహిళా శక్తి

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటారు. 2025 మహిళా దినోత్సవాన్ని 'ప్రతి మహిళకూ, ప్రతి బాలికకూ హక్కులు, సమానత్వం, సాధికారత' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళలు సాంకేతిక రంగంలో రాణించడం, సమాన అవకాశాలు పొందడం, డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఈ థీమ్ ముఖ్య ఉద్దేశం. 1975 మార్చి 8న ఐక్యరాజ్యసమితి అధికారికంగా ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రతిపాదించింది.

-గణేశ్‌నగర్, కరీంనగర్ టౌన్, కరీంనగర్ కల్చరల్, జగిత్యాల, సిరిసిల్ల

అన్ని రంగాల్లో రాణించాలి

బీఎస్ లత, అదనపు కలెక్టర్, జగిత్యాల



మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి. విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయం, వ్యాపారం ఇలా పలురంగాల్లో మహిళలు కీలకపాత్రను పోషించాలి. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. వంటింటికి మహిళలు పరిమితం కాదని, అవసరమైన ఏబాధ్యతనైనా సమర్థవంతంగా నిర్వర్తిస్తారని చాటాలి. గొప్పగొప్ప మహిళల నేపథ్యాలను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలి.

వెనుకబాటుతనం పోవాలి..

సత్యమ్మ, జిల్లా ఉపాధి కల్పనాధికారి, జగిత్యాల



మహిళల్లో వెనుకబాటుతనం పారద్రోలేందుకు వారిలో ధైర్యం కల్పించాలి. మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహించి చట్టాలు, శిక్షలపై వారికి వివరిస్తూనే మనోధైర్యం పెంచాలి. అన్నిరంగాల్లో ధైర్యంగా ముందుకు వచ్చే విధంగా వారికి ప్రోత్సాహం కావాలి. వారిలో చైతన్యం తీసుకువచ్చే విధంగా స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాలు చేపట్టాలి.

మహిళలు తమ శక్తిని చాటుకోవాలి

సీహెచ్ సోఫియా, జిల్లా కోశాధికారి, జగిత్యాల



మహిళలు వంటింటికే పరిమితం కాకూడదు. చదువులో ముందుండి ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ శక్తిని చాటుకోవాలి. తమకు నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకుని స్వశక్తితో ముందుకు వెళ్లాలి. సమాజంలో మహిళల పాత్ర ఎంత గొప్పదనే విషయాన్ని ప్రతీ ఒక్కరికి అర్థమయ్యేలా ఎదగాలి. మహిళ ఉద్యోగులను గౌరవించాలి.

దిక్సూచిగా నిలవాలి

సుజాత, డిస్ట్రిక్ట్ ఆడిట్ అధికారి, జగిత్యాల

ఒకప్పుడు నాలుగు గోడల మధ్య వంటింటి కుందేళ్లుగా మహిళలు ఉండే వారు. ఈరోజు మహిళ లు అన్ని రంగాల్లో రాణిస్తు న్నారు. స్వశక్తితో మహిళలు రాజకీయ రంగాల్లో దూసుకెళ్తున్నారు. ఉద్యోగం స్త్రీ బాధ్యతగా చేపట్టినప్పుడే మహిళా లోకం ఆర్థికంగా ఎదుగుతారు. సమాజానికి దిక్సూచిగా మహిళలు నిలవాలి.



స్వతంత్రంగా జీవించాలి..

ప్రొఫెసర్ డి వరలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కరీంనగర్



మహిళలు స్వతంత్రంగా జీవించాలి. నిరంతర నైపుణ్యాలు మెరుగుపరచడం, వ్యక్తిగత, వృత్తి పరమైన అభివృద్ధి కోసం ప్రయత్నించాలి. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి.

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పించాలి

సీహెచ్ నిరోష, లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మానకొండూర్



మహిళలు పని ప్రదేశంలో ఇంకా మహిళలు సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించాలి. అన్ని రంగాల్లో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది.

అన్ని రంగాల్లో మహిళల ముందంజ

నాయిని సుప్రియ, ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్

అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉంటున్నారు. ఇది గొప్ప విషయం. మహిళలు తలచుకుంటే కానిదేమీ ఉండదు. ధైర్యంతో ఇంకా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఓ మహిళా అధికారిగా ఆనందంగా ఉంది.



మహిళలు ఆర్థికంగా ఎదగాలి

డాక్టర్ సుజాత, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, కరీంనగర్

మహిళలు ఆర్థిక స్వతంత్రత సాధించాలి. అది విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. విద్య ద్వారా మానసికోల్లాసం కూడా లభిస్తుంది. మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించడం ద్వారా పేదరికంతోపాటు ఆధారపడడమనే చక్రాన్ని విచ్ఛిన్నం చేయవచ్చు.





మహిళల హక్కులపై అవగాహన కల్పించాలి

డాక్టర్ పొలాస మాధవి, ప్రొఫెసర్, చల్మెడ మెడికల్ కాలేజీ.

మహిళల హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఇది అందరూ బాధ్యతగా తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నవయస్సులో పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. విద్య, ఉద్యోగ రంగాల్లో లింగ వివక్ష లేకుండా చూడాలి.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కె.సబిత, జిల్లా సంక్షేమ అధికారి, కరీంనగర్

మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో చాలా మంది ఉపాధిపొందుతున్నారు. వ్యాపార రంగంలోనూ రాణించాలి ఏ రంగంలోనైనా విజయం సాధించగలమనే విశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగాలి.





మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

కట్ట మంజులాదేవి, సూపరింటెండెంట్, జవహర్ బాలభవన్

అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. ప్రతీ మహిళా ఎవరినో ఒకరిని స్ఫూర్తిగా తీసుకోవాలి. నాకు స్ఫూర్తి ఎంఎస్ సుబ్బులక్ష్మి. అందుకే సంగీతం నేర్చుకున్నా.. నేర్పుతున్నా. కొన్నేళ్లుగా బాలభవన్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నా.

మహిళా సాధికారత సాధించాలి

ఎ.సరిత, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కరీంనగర్

మహిళలు అన్ని అంశాల్లో సాధికారత సాధించాలి. గ్రంథాలయంలో మహిళలు, యువతులు, విద్యార్థినుల పఠన కోసం సంస్థ చైర్మన్ చొరవతో ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారు. మహిళల రక్షణ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, సేవలపై అవగాహన పెంచుకోవాలి.



మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

స్వరూపరాణి, డిప్యూటీ కమిషనర్, కరీంనగర్ నగర పాలక సంస్థ

మహిళలకు ఏ బాధ్యత అప్పగించినా అది నిబద్ధతతో పూర్తి చేస్తారు. ఏ పనిలోనైనా నమ్మకం, విశ్వాసం కలిగి ఉంటూ అన్ని రంగాల్లో రాణిస్తారు. చదువులో ముందుండి అనుకున్న లక్ష్యాన్ని సాధించినప్పుడే సమాజం గౌరవిస్తుంది. సమాజంలో గౌరవం పొందేందుకు ప్రతి మహిళా పట్టుదలతో ముందుకెళ్లాలి.





కలిసికట్టుగా స్వయం ఉపాధి వైపు..



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న పెద్దపల్లి కలెక్టర్ శ్రీహర్ష

- **చిల్లపల్లి గ్రామానికి జాతీయ పురస్కారం**
- **రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం**
- **ప్రోత్సాహకంగా రూ. 75 లక్షలు**
- **అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చిల్లపల్లి సక్సెస్ స్టోరీ**

మంథని/మంథనిరూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఐక్యత, క్రమశిక్షణ, పర స్పర సహకారంతో మంథని మండలంలోని చిల్లపల్లి మహిళలు స్వయం ఉపాధి పొందుతూ వివిధ రకాల వ్యాపారాలతో ఆర్థికంగా ఎదుగుతున్నారు. తమ చదువును, పొందిన వృత్తి నైపుణ్యాన్ని ఉపాధి వైపు మళ్లించి ఇంతింతై వటుడింతై అన్నట్లుగా స్వయం సమృద్ధిలో దూసుకెళ్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు గ్రామంలో శ్రీజ్యోతి మహిళా గ్రామైక్య సంఘంలోని 33 సొసైటీల్లో సభ్యులుగా ఉన్న 335 మంది చేయిచేయి కలిపారు. అయితే డబ్బును పొదుపు చేయడమే కాదు కాలానికి అనుగుణంగా పురుషులతో సమానంగా పోటీ పడి ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్రణాళికలు వేసుకున్నారు. ఈ క్రమంలో స్వయంగా ఉపాధి వైపు అడుగులు వేసి విజయవంతమయ్యారు. తమ డబ్బును సంఘాలలో జమ చేసుకుంటూ, అందులో నుంచే రూపాయి వడ్డీకి రుణం తీసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో వీరంతా కిరాణ షాపులు, కుట్టు మిషన్లు, కోళ్ల పెంపకం, పాడిగేదెలు, కంగన్ హాల్, చికెన్ షాప్, బ్యూటీపార్లర్స్, టిఫిన్ సెంటర్లు, డ్రాగన్ ఫ్రూట్స్ తోట, పిండి గిర్ని, కూరగాయల సాగు, మెడికల్ షాపు, ఐకేపీ సెంటర్ నిర్వహణ, అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేయడం తదితర పనులతో మహిళలు స్వయం ఉపాధితోపాటు వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు. తమ సంఘాల్లో రూపాయి వడ్డీకి రుణం తీసుకుని ఉపాధి పొందుతూ వివిధ వ్యాపారాల్లో రాణిస్తూ, గ్రామాభివృద్ధిలో కీలకంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం ఉత్తమ గ్రామంగా గుర్తించింది.

దేశ వ్యాప్తంగా 27 గ్రామ పంచాయతీల్లో గ్రామంలో 9 అంశాలను పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు ప్రకటించగా ఇందులో ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో చిల్లపల్లి పంచాయతీకి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం దక్కింది. 2024 డిసెంబర్ 11న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కలెక్టర్ కోయ శ్రీహర్ష పురస్కారం అందుకున్నారు. పురస్కారం తోపాటు రూ. 75 లక్షల నగదు ప్రోత్సాహాన్ని గ్రామానికి దక్కేలా చిల్లపల్లి గ్రామ మహిళలు తమ శక్తిని చాటారు.





గ్రామంలో మహిళా సంఘం సభ్యుల సమావేశం, టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

పని చేసుకుంటూనే టైలరింగ్‌లో శిక్షణనిస్తున్నా


రామిళ్ళ మల్లేశ్వరి, చిల్లపల్లి.



భర్త వ్యవసాయం చేస్తుండగా నేను కుట్టు పని చేసుకుంటూ ఉపాధి పొందుతున్నా. అలాగే గ్రామంలోని చాలా మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నా.. ఇప్పటి వరకు 40 మంది మహిళకు పైగా శిక్షణ ఇచ్చాను. జ్ఞానోదయ పొదుపు సంఘంలో రెండేళ్ల కిందట రూ.లక్ష రుణం తీసుకొని కుట్టు యంత్రాలు కొనుగోలు చేశాను. కుట్టు పని, శిక్షణ తోపాటు చీరలు, దుస్తులు అమ్ముతున్నా. వీటి ద్వారా ఆదాయం పొందుతున్నాను.

మహిళల కృషితోనే జాతీయ స్థాయిలో గ్రామానికి గుర్తింపు

ఆరె సౌజన్య, సీఏ, చిల్లపల్లి.



శ్రీజ్యోతి గ్రామైక్య సంఘంలో సభ్యులందరితో నెలకు రెండు సార్లు మీటింగ్ పెట్టుకుంటాం. ఇందులో ఆర్థిక లావాదేవీలతోపాటు మహిళల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన అంశాలపై చర్చిస్తాం. సంఘంలోని సభ్యులందరు వివిధ రకాల వ్యాపారాలు చేసుకోవటానికి లోన్లు తీసుకొని తిరిగి వడ్డీతో కలిసి చెల్లిస్తుండటంతో ఇతర సభ్యులకు రుణాలు సకాలంలో ఇవ్వటానికి వీలుకల్గుతుంది. సంఘ సభ్యుల స్వయం ఉపాధితో గ్రామంలో వారి కుటుంబాలు అన్ని విధాలుగా సంతోషంగా ఉన్నాయి. వీరి ఆర్థిక క్రమశిక్షణ, స్వావలంబన, స్వయం ఉపాధి జాతీయ స్థాయిలో మా గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురావడం సంతోషంగా ఉంది.

మహిళా సంక్షేమానికి శుక్రవారం సభ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళల సమస్యలు పరిష్కరించి, వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు శుక్రవారం సభ ద్వారా సేవలు అందిస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్‌లోని జగ్జీవన్ రావ్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే ఈ సభకు వస్తే మహిళలకు అన్ని ఆరోగ్య విషయాలు తెలుస్తాయన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, ఊరు, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా 54 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలే ప్రైవేట్ ఆసుపత్రిలో చేయించుకుంటే రూ.40 వేలకు పైగా ఖర్చు అవుతాయన్నారు. అంగన్వాడి కేంద్రాలను ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చి నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నా మన్నామన్నారు.

కిసాన్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. బోధనా తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉచితంగా షూ పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ పాఠశాలలోనే అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయడం కోసం అదనపు గది నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డీడబ్ల్యుఓ సబిత, మెప్మా పీడీ వేణుమాధవ్, డిప్యూటీ డిఎంహెచ్ఓ సుజాత, డీసీపీఓ పర్వీన్, పీఓ సనా తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు మహిళా దినోత్సవ సంబరాలు



చొప్పదండిలో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న సిబ్బంది

కరీంనగర్ అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు చోట్ల శుక్రవారం ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు నిర్వహించారు. కరీంనగర్‌లోని అపూర్వ డిగ్రీ కళాశాల(బాలికల)లో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ రాజ్యాంగం స్త్రీలకు కల్పిస్తున్న హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్ పాల్గొన్నారు.

● కరీంనగర్‌లోని అమ్ము స్వచ్ఛంద సంస్థ, భారతీయ జనతా పార్టీ నాయకురాలు డాక్టర్ పి.సుజాతరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం హౌసింగ్‌బోర్డు చౌరస్తాలో శ్రీగాయత్రి బంకెట్ హాల్లో కేక్ కట్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అంతకుముందు కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమళ్ల శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేశారు. డాక్టర్ శ్వేత, సావిత్రి, కొత్తిరెడ్డి సుజాతరెడ్డి, తులసి, రమా, అమితారావు, పద్మ అనిల్, అరుణ పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులను, వంట మనుషులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు పసునూరి శ్రీధర్, సంగభట్ల సురేందర్, సముద్రాల అంజయ్య, మల్లికార్జున్ పాల్గొన్నారు.

● చొప్పదండి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు శ్రీకీర్తన, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీదేవి, ఆసుపత్రి సిబ్బందిని కొలిమికుంట మాజీసర్పంచ్ సుజాత, మాజీ కౌన్సిలర్ మానస సన్మానించారు.

జమ్మికుంట: మండల వనరుల కేంద్రంలో ఎంఈవో హేమలత ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

హుజూరాబాద్: పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్ స్కూల్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు.

గణేశ్‌నగర్: కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'మహిళా సాధికారత.. లింగ వివక్షత' అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: స్త్రీ సాధికారతకు సమానత్వమే పునాది అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, కార్యదర్శి ఎడ్ల రమేశ్, జిల్లా శ్రామిక కన్వీనర్ మారెళ్ళ కవిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నగరంలోని కళాభారతి నుంచి ప్రెస్‌భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళలు తమ జీవితాలపై హక్కును సాకారం చేసుకోవాలని, వారి గొంతుకను వినిపించాలని, అప్పుడు మాత్రమే ప్రపంచ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. పారిశ్రామిక మహిళా కన్వీనర్ మరేళ్ల శ్రీలత మాట్లాడుతూ సమాన వారసత్వ చట్టం అమల్లోకి వచ్చినా కుమారులకే వ్యవసాయ భూములపై అధికారం వస్తోందని, వరకట్నం దురాచారం ఇంకా కొనసాగుతోందని అన్నారు. మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్య క్షుడు రవీందర్ నగర అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



అమ్ము స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు

సంక్షిప్తంగా..

గణేశ్‌నగర్: ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం నుస్తులాపూర్‌లోని కరీంనగర్ డెయిరీని క్షేత్రస్థాయిలో సందర్శించారు.

సుభాష్‌నగర్: వాసవిక్లబ్ అంతర్జాతీయ కపుల్స్ జిల్లా అధ్యక్షుడు జగదీశ్, ఎన్‌డీ వనిత క్లబ్ అధ్యక్షురాలు రజిత ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేద ఆర్యవైశ్య యువతికి పుస్తెమట్టెలు అందజేశారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని 17వ డివిజన్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వారాల నర్సింగం శుక్రవారం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

సుభాష్‌నగర్: కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న ఢిల్లీలో నిర్వహించే ధూంధాం కార్యక్రమం పోస్టర్‌ను ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళా మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామంచ భరత్ శుక్రవారం ప్రెస్‌భవన్‌లో ఆవిష్కరించారు.

గణేశ్‌నగర్: టీజీ ఎన్పీడీసీఎల్ ఉద్యోగుల కోసం శుక్రవారం డాక్టర్ రాకేష్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్ పర్యవేక్షక ఇంజనీరు రమేష్ బాబు శిబిరాన్ని ప్రారంభించారు.

గణేశ్‌నగర్: శాతవాహన యూనివర్సిటీ మూసివేసిన స్టడీ హాల్ ఓపెన్ చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం యూనివర్సిటీలో అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్ పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: దేవాదాయశాఖ పరిధిలోని జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో హుండీలను సోమవారం ఉదయం 11 గంటలకు, ప్రశాంత నగర్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ హుండీలను ఒంటి గంటకు లెక్కించనున్నట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు.

ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 455 మంది గైర్హాజరు

కరీంనగర్ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం రెండో రోజు శుక్రవారం నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షకు 455 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ విభాగంలో కలిపి 18,222 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా జనరల్ విభాగంలో 314 మంది, ఒకేషనల్‌లో 141మంది మొత్తం 455 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేదు. జనరల్ విభాగంలో 16,303 మంది, ఒకేషనల్‌లో 1464 మంది మొత్తం 17,767 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, డీఈసీ, హెచ్‌పీసీ, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఆకస్మిక తనిఖీ చేశాయి.

ఎల్‌ఆర్‌ఎస్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

కరీంనగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎల్‌ఆర్‌ఎస్‌ను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అన్నారు. శుక్రవారం ఎల్‌ఆర్‌ఎస్‌పై హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ 2020 క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలన్నారు. లేఔట్ క్రమబద్ధీకరణ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నవారు పూర్తి ఫీజుతోపాటు ప్రో- రాటా ఓపెన్ స్పేస్ చార్జిలను మార్చి 31లోపు చెల్లిస్తే 25 శాతం రాయితీ లభిస్తుందన్నారు. నిషేధిత జాబితాలో లేని, బఫర్, ఎఫ్‌టీఎల్, చెరువులు, కుంటలు తదితర ప్రాంతాలలో లేని ప్లాట్లకు ఆటోమేటిక్‌గా ఎల్‌ఆర్‌ఎస్‌కు అనుమతి లభిస్తుందన్నారు. చెరువులు, నీటి వనరులు తదితర ప్రాంతాలకు 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు మాత్రం రెవెన్యూ నీటిపారుదల శాఖ అనుమతులు తప్పనిసరన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులు 90 శాతం రిఫండ్ అవుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పమేలా సత్పతి తదితరులు పాల్గొన్నారు.

సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్

సుభాష్‌నగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ అధ్యక్షుడిగాడాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ శుక్రవాం ఎన్నికయ్యారు. కార్యదర్శిగా డాక్టర్ వి.మంగీలాల్, కోశాధికారిగా డాక్టర్ సాయి ప్రసాద్‌ను ఎన్నుకున్నారు.సీనియర్ సర్జన్ డాక్టర్ వి.సూర్యనారాయణరెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, టీఎస్ ఎంసీ మెంబర్ డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ అమిత్, మెంబర్ డాక్టర్ శ్రీధర్, తాన అధ్యక్షుడు డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కరీంనగర్ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్య లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, యూనియన్ గౌరవ అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్మికులకు కనీస వేతనాన్ని రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వృద్ధాశ్రమానికి వాటర్ కూలర్ల అందజేత

భగత్‌నగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ అనాథ, వికలాంగ, వృద్ధాశ్రమానికి ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో రెండు వాటర్ కూలర్లను అందజేశారు. ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎస్‌వీ ప్రసాదరావు యూనియన్ మహిళా విభాగాన్ని అభినందించారు. మహిళా విభాగం కన్వీనర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

గణేశ్‌నగర్,మార్చి 7(ఆంధ్రజ్యోతి): పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రమేష్ బాబు అన్నారు. శుక్రవారం కరీంనగర్ సర్కిల్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. 33కేవీ లింకింగ్ లైన్‌లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేయాలన్నారు. డీఈలు ఉపేందర్, రాజం, తిరుపతి, లక్ష్మారెడ్డి కాళిదాసు చంద్రమౌళి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా

హుజూరాబాద్ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే వేతనాలను విడుదల చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట నాయకులు, పంచాయతీ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ గ్రీన్‌ఛానల్ ద్వారా కార్మికులకు నేరుగా అకౌంట్లో వేతనాలు చెల్లిస్తామని ఇప్పటివరకు వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. నాయకులు కదిరిరమేష్, షైపాల్, గుగ్గిళ్ల రాములు, ఆడపుఅరవింద్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

గంగాధర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాలపల్లి ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఏనుగు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాలలో కార్పొరేట్ కు దీటుగా విద్య అందుతోందన్నారు. విద్యార్థులకు టై,బెల్టులను పంపిణీచేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతికప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

జాతీయ స్థాయి ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి గణిత, సైన్స్ ఒలింపియాడ్, ఆల్ ఇండియా టాలెంట్ టెస్ట్‌లో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారు. శుక్రవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బంగారు, రజత పతకాలతోపాటు, ప్రశంసపత్రాలు సాధించిన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే వివిధ పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా చిట్టుమల్ల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

గణేశ్‌నగర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): చిట్టుమల్ల శ్రీనివాస్ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ట్రస్ట్, రామాలయం ఛైర్మన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. వాసవి వృద్ధాశ్రమంలో ఆలయ డైరెక్టర్లు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. నాన్న ఫౌండేషన్ గోగుల ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం చేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి వెంకటేశం, కోశాధికారి పడగంటి శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు జీడిగే సాయి కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆకుల మెహర్, కోశాధికారి ఉప్పల అమర్, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కాచం రాజేశ్వర్, కోశాధికారి బొల్లం శ్రీనివాస్, సంకష్ట కన్వీనర్ రాచమల్ల భద్రయ్య, సేవా కార్యక్రమాల కన్వీనర్ తాటిపల్లి సుభాష్, ఆలయ ట్రస్ట్ డైరెక్టర్లు నార్ల శ్రీనివాస్, చిట్టుమల్ల వేణుగోపాల్, తిరుపతి పాల్గొన్నారు.

నేడు లోక్ అదాలత్

కరీంనగర్ క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవచ్చని, అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని పేర్కొంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ సబ్‌స్టేసన్ మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 9:30 నుంచి 11 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టూ ఏడీఈ లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని కట్ట రాంపూర్, వినాయకనగర్, గిద్దెపెరుమాండ్ల గుడి, గౌతమ్‌నగర్, హనుమాన్ నగర్, ప్రొఫెసర్‌నగర్, తిరుమలనగర్, అల్కాపురి కాలనీ, కోతిరాంపూర్, మెయిన్‌రోడ్, ఉజ్వల పార్క్, హనుమాన్‌నగర్, గణేష్‌నగర్ బైపాస్ పాంతల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రతీ ఒక్కరు చరిత్ర తెలుసుకోవాలి

గణేశ్‌నగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): చరిత్రను తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతీ భారతీయుడికి ఉందని జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాజుల రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం లోకమాత దేవి అహల్యాబాయ్ హోల్కర్,(1725-1795) త్రిశత జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకమాతా దేవి అహల్య బాయ్ హోల్కర్ అనే సామాజిక కార్యక్రమాలు చేపట్టారన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.శ్రీరంగ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్, కామర్స్ విభాగా. దిపతి, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్.గోపీకృష్ణ, ఏసీవో బి.సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చొప్పదండి/జమ్మికుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్లు నాగరాజు, ఎండీఆయాజ్ వేర్వేరు ప్రకటనలో తెలిపారు. 2020సంవత్సరంలో వెయ్యి రూపాయలు చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ కొరకు రిజిస్టర్ చేసుకున్న ప్లాట్ల యజమానులు, అనుమతి లేని లే-అవుట్లలోని ఖాళీ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల31 వరకు అవకాశాన్ని కల్పించిందని తెలిపారు. మార్చి31లోపు ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించేవారికి 25శాతం రాయితీ కూడా ప్రకటించిందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంతోపాటు బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టౌన్ఏఈ శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. హుజూరాబాద్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఉదయం10నుంచి 12గంటలవరకువిద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయాగ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

గన్నేరువరం: మండల కేంద్రం గన్నేరువరం, ఖాసింపేట గ్రామాల్లోని సబ్‌స్టేషన్‌లలో మరమ్మతు పనులను చేపడుతున్నందున శనివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నేరువరం మండలంలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీచైతన్య అధ్యాపకుడికి డాక్టరేట్

తిమ్మాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్సెస్ కళాశాలలో కంప్యూటర్స్ విభాగంలో సీనియర్ అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న శనిగరపు నవీన్‌కుమార్ చేసిన పరిశోధనలకుగాను ద్రావిడ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను అందజేసిందని విద్యాసంస్థల ఛైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం నవీన్‌కుమారేను ఛైర్మన్ రమేష్‌రెడ్డి, డైరెక్టర్ నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్‌రాజు, విభాగాధి పతులు అభినందించారు.

జనరిక్ మందుల వాడకంపై అవగాహన కల్పించాలి

హుజూరాబాద్‌రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జనరిక్ మందుల వాడకంపై ఆరోగ్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు అన్నారు. జాతీయ జనఔషధ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వేడుకలు జరిగాయి. ఈ మాట్లాడుతూ జనరిక్ మందులు అత్యంత నాణ్యమైనవని, అతితక్కువ ఖర్చుతో లభిస్తాయని తెలిపారు. కార్యక మంలో వైద్యాధికారి డాక్టర్ మధు, జిల్లా హెల్త్‌ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, ఎంపీహెచ్‌వో విజయేందర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అన్ని ఆరోగ్యఉపకేంద్రాల్లో జనరిక్ ఔషధాలపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాజేష్, ఆరోగ్య ఉప కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

రూ.7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7150 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 22మంది రైతులు 242క్వింటాళ్ల విడిపత్తి, ఐదుగురు రైతులు ఏడు క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగవేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7150, కనిష్ఠ ధర రూ.5800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పిన పట్టభద్రులు



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పారని మాజీ మేయర్, బీజేపీ నేత యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల విజయం వెనుక కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కృషి ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మూడు జిల్లాల్లో మూడు బహిరంగ సభలు పెట్టినా కాంగ్రెస్ ఓడిపోయిందంటే ప్రజలు ఆ పార్టీని వ్యతిరేకిస్తున్నారన్నారు. బీజేపీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెలిస్తే మంత్రి పొన్నం ప్రభాకర్ చులకనగా వ్యాఖ్యలు చేస్తున్నారని, కాంగ్రెస్‌లో సమన్వయం లోపముందని ఆ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతున్నారని అన్నారు. స్టేట్ హైవే నంబరు-1 రాజీవ్ రహదారిని నేషనల్ హైవేగా మార్చాలంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్రమంతి బండి సంజయ్‌కి సవాల్ చేయడం చూస్తే ఆయనకున్న పరిజ్ఞానం, అవగాహన రాహిత్యం అర్థమవుతోందన్నారు. 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ రహదారి నిర్మాణం చేపట్టగా పొన్నం ఎంపీల ఫోరం అధ్యక్షుడిగా ఉన్నారని, కాంట్రాక్టర్ 2036 వరకు టోల్‌టాక్స్ వసూలు చేసేందుకు ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం రద్దు కాకుండా నేషనల్ హైవే ఎలా చేస్తారని ప్రశ్నించారు. ముందు రాజీవ్‌రహదారి కాంట్రాక్టర్‌తో చేసుకున్న వీవోటీని రద్దు చేయించి నేషనల్ హైవే అథారిటీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అర్జీ పెట్టుకోవాలని, అప్పుడు నేషనల్ హైవేగా మారుస్తారని అన్నారు. బీజేపీ నాయకులు గాయత్రి, కొలిపాక శ్రీనివాస్, శివకుమార్, ప్రవీణ్, కొండపల్లి సతీష్, వేణు, మొండయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ హుండీ ఆదాయం రూ.51,130

హుజూరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీహనుమాన్ దేవాలయ హుండీని శుక్రవారం దేవాదాయ ధర్మదాయశాఖ జిల్లా పరిశీలకుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ద్వారా రూ.51,130 ఆదాయం వచ్చిందన్నారు. ఈవో సుధాకర్, ఛైర్మన్ కొలిపాక శంకర్, డైరెక్టర్లు నరేష్, రాజేందర్, మధులత, పున్నంచందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ దేశ వ్యాప్తంగా అమలు చేయాలి

భగత్‌నగర్: దేశ వ్యాప్తంగా ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జాతీయ కౌన్సిల్ సభ్యుడు బోయిని అశోక్ అన్నారు. శుక్రవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 10, 11 తేదీల్లో వేములవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

హుజూరాబాద్ మున్సిపాలిటీలోకి మూడు గ్రామాలు?

హుజూరాబాద్‌రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల పరిధిని పెంచేదిశగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు మున్సిపాలిటీకి సమీపంలో ఉన్న గ్రామాలను విలీనం చేయాలంటూ ఆదేశాలు జారీకావడంతో స్థానికఅధికారులు ప్రక్రియ మొదలు పెట్టారు. మండలంలోని రంగాపూర్, రాంపూర్, పెద్దపాపయ్యపల్లి గ్రామాలు మున్సిపాలిటీకి సమీపంలో ఉండగా వాటిని విలీనం చేసే అంశంపై సమగ్రవివరాలను పంపాలని ఉన్నతాధికారులు మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు ఆ గ్రామాలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకొని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపించేందుకు అధికారులు ప్రక్రియను మొదలు పెట్టారు. విలీన ప్రక్రియను ప్రజలు, తాజామాజీ సర్పంచులు వ్యతిరేకిస్తున్నారు.

రంగాపూర్ గ్రామాన్ని విలీనం చేయవద్దు..

రంగాపూర్ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయవద్దని ఆ గ్రామ మాజీసర్పంచ్ బింగి కరుణాకర్ సీఎస్ శాంతికుమారికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేస్తే గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద ఆధారపడి ఉన్న కుటుంబాలు ఉపాధిని కోల్పోయి రోడ్డున పడేఅవకాశం ఉందన్నారు. విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

గంగాధర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గంగాధరలో శుక్రవారం ఉపాధిహామీ సామాజికతనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. మండలంలోని 33గ్రామాల్లో ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన 6.26కోట్ల పనులపై గ్రామాలవారిగా సమాచారం చదివి వినిపించారు. ఆయా గ్రామాల్లో చేపట్టినపనుల్లో రూ.1,11,202 నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించిన డీఆర్డీవో పీడీ శ్రీధర్ రికవరీకి ఆదేశాలుజారీచేశారు. ఏపీడీక్రిష్ణ, క్యూసీలు శ్రీనివాస్, సత్య నారాయణ, ఎంపీ డీవో రాము, ఫీల్డ్‌అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

గన్నేరువరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగపల్లి గ్రామంలో ఇటీవల తాటిచెట్టు పైనుంచిపడి మృతిచెందిన గీతకార్మికుడు ముత్యం ధర్మయ్యగౌడ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షలఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని గౌడసంఘం మండల అధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ధర్మయ్య కుటుంబాన్ని సంఘ సభ్యులతో కలిసి పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందజేశారు.

రంగు మారిన నల్లానీరు

చొప్పదండి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గణేష్‌నగర్‌లో నల్లానీరు బెల్లం రంగులో వస్తున్నాయని బీఆర్ఎస్ నాయకుడు కొక్కులాం రాంమోహన్ మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు ఫిర్యాదుచేశారు. రంగుమారిన నీటితో అనారోగ్యానికి గురవుతున్నామని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బాలికలకు సైకిళ్లు

చొప్పదండి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి బాలికల జడ్పీఉన్నత పాఠశాల 18మంది విద్యార్థినులకు కరీంనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఉమెన్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ప్రధానకార్యదర్శులు జమున, ప్రవీణ్ సైకిళ్లను అందజేశారు.



సైకిళ్లతో బాలికలు

పరామర్శలు..

చొప్పదండి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో గురువారం ఆత్మహత్య చేసుకున్న ప్రేమజంట కొండపర్తి అరుణ్‌కుమార్, నంపల్లి అలేఖ్య కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం పరామర్శించి తనప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చొప్పదండిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రాగంపేటవాసి వొడ్నాల రమేష్ కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేలు అందించారు.

వీణవంక: మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త నల్లగోనివీరయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని శుక్రవారం బిల్డర్, కాంగ్రెస్ నాయకుడు కొమ్మిడి రాకేష్‌రెడ్డి పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

నియామకాలు..

శంకరపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండలంలోని మెట్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జీగా అశోక్‌కుమార్, గద్దపాక సంఘంపర్సన్ ఇన్‌చార్జీగా లక్ష్మణాచారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వీరిని సిబ్బంది సన్మానించారు.

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి కాంగ్రెస్‌పార్టీ నూతన గ్రామశాఖ కమిటీని మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాపర్తిరవి, ప్రధాన కార్యదర్శిగా మునిగాల రాజును ఎన్నుకున్నారు.

డప్పులతో వెళ్లి ఇంటిపన్ను వసూలు

శంకరపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తారంలో గ్రామపంచాయతీసిబ్బంది డప్పులు వాయిస్తూ బకాయిదారుల ఇంటింటికి తిరుగుతూ ఇంటిపన్ను వసూళ్లు చేశారు. ఉన్నతాధికారులు టార్గెట్ విధించడంతో ఈవిధంగా ఇంటిపన్ను వసూలు చేస్తున్నామని సిబ్బంది తెలిపారు.

మహిళా సాధికారతపై సదస్సు

హుజూరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వడిగ్రీ కళాశాలలో మహిళాదినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి మాట్లాడుతూ అక్షరాస్యతతోనే మహిళా సాధికారత సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, అధ్యాపకులు లింగారెడ్డి, రేణుక, రుబీనారాణి, సుమలత,స్వప్న, రమ, పల్లవి, మంగమ్మ,నరేందర్, మహిపాల్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.